విద్యార్థులకు 'ఉన్నతవిద్య' కలేనా?

- మండలంలో జూనియర్ కాలేజీ లేక విద్యార్థుల అవస్థలు
- పట్టింపులేని పాలకులు, అధికారులు


పెద్ద పెల్లిలోని జూనియర్ కళాశాల

పాలకుర్తి: మండలపరిధిలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య కలగానే మిగులుతోంది. ఉన్నత విద్య అందుబాటులో లేక పదోతరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళాశాల చదువులకు పెద్దపల్లి, గోదావరిఖని, ధర్మారం వంటి పట్టణ ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోందని సరైన రవాణా సౌకర్యం లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాలకుర్తి మండలకేంద్రంగా ఏర్పాటై ఆరేళ్లు గడిచినా ఇప్పటికీ మండల పరిధిలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసేదిశగా పాలకులు, అధికారులు ఆలోచన చేయకపోవడం గమనార్హం. బసంత్‌నగర్ వాస్తవ్యుడు, ప్రస్తుతం మధ్యప్రదేశ్ రాష్ట్ర కమిషనర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి ఏడాదిన్నర క్రితం బసంత్‌నగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుచేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి లేఖ రాసినప్పటికీ స్పందన లేదు.

ప్రతీఏటా 400 మంది విద్యార్థులు...

పాలకుర్తి మండల పరిధిలో మొత్తం 20 గ్రామపంచాయతీలున్నాయి. వీటిలో 8 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మూడు ప్రైవేటు పాఠశాలలు, ఒక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, రెండు ఎస్సీ హాస్టల్స్ ఉన్నాయి. ప్రతీ సంవత్సరం ఈ పాఠశాలల్లో చదివి పదోతరగతి పూర్తిచేసే విద్యార్థులు దాదాపు 400 వరకు ఉంటారు.

- మండలవ్యాప్తంగా 423 పదోతరగతి పూర్తయిన తర్వాత విద్యార్థులు కళాశాలలు లేక గోదావరిఖని, పెద్దపల్లి తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలలో ఉన్నతవిద్యకు వెళ్తున్నారు.
- పెద్దపల్లికి వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ధర్మారం క్రాస్‌రోడ్డు వద్దకు వచ్చి అక్కడి నుంచి మరో బస్సులో పెద్దపల్లికి వెళ్తున్నారు.
- జయ్యారం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం బస్సు సౌకర్యం ఉంది.
- బస్సు మిస్సయితే ఆరోజు కళాశాల బంద్.
- జయ్యారం ప్రభుత్వ పాఠశాలకు సెలవుదినం ఉన్న బస్సురాదు. దీంతో కళాశాలకు చెల్లించే ఫీజులకన్నా రవాణా చార్జీలే తడిసి మోపెడవుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బస్సు మిస్సయితే ఇబ్బందే..



మాది రామారావుపల్లి. నేను పెద్దపల్లిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్న. ఉదయం, సాయంత్రం కళాశాల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సు మా గ్రామం మీదుగా వెళ్తుంది. ఒకవేళ బస్సు మిస్సయితే ఆరోజు కాలేజీకి వెళ్లడం బంద్. ప్రైవేటు వాహనాలు సరిగ్గా ఉండవు. ఒకవేళ ఉన్న రూ.60 చెల్లించాలి. పైగా సరైన సమయానికి కాలేజీకి చేరుకోలేం.

– శివశంకర్, ఇంటర్ విద్యార్థి

ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయాలి



పాలకుర్తి మండలపరిధిలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటుచేయాలి. స్థానికంగా కళాశాల లేకపోవడంతో పెద్దపల్లి, గోదావరిఖని ప్రాంతాలకు వెళ్ళాల్సివస్తోంది. బస్సు సౌకర్యం కూడా సరిగ్గా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వర్షాకాలం, చలికాలమైతే మా బాధలు చెప్పలేనివి. బస్సు మిస్సయితే ప్రైవేట్ వాహనాలు, లిఫ్ట్‌తీసుకుని వెళ్లాల్సివస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కళాశాల ఏర్పాటు చేయాలి.

– శైలజ, ఇంటర్ విద్యార్థిని

క్లుప్తంగా

విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మంథని: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు నియోజకవర్గంలో అనేక అనేక విద్యాసంస్థలను తీసుకువచ్చినట్లు, విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు సాధించేలా కోచింగ్ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. శనివారం మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా, సాంస్కృతిక ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయిలో నిలవాలన్నారు. చదువుతో పాటు క్రీడా నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ తాహెర్‌హుస్సేన్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్లు మాదాడి ప్రభాకర్‌రెడ్డి, కొండేల మారుతి పాల్గొన్నారు.

బగుళ్ల దేవస్థానానికి రోడ్డు మంజూరు చేయాలి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న జెడ్పీ చైర్మన్

ముత్తారం: మండలంలోని బగుళ్ల ఆలయానికి రోడ్డు మంజూరు చేయాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు మంత్రి దయాకర్‌రావును కోరినట్లు రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు అత్తె చంద్రమౌళి తెలిపారు. హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్‌లో మంత్రిని మర్యాద పూర్వకంగా కలసి రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందించినట్లు తెలిపారు. బగుళ్ల గుట్టకు రోడ్డు లేకపోవడంతో భ భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని విన్నవించారని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ

కమాన్‌పూర్: మండలంలోని పేంచికల్‌పేటలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం ఎంపీపీ రాపకొండ లక్ష్మి శంకుస్థాపన చేశారు. గ్రామంలోని పాఠశాలలో బోరు, ఏడో వార్డులో డ్రైయినేజీ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండ వెంకటేశ్, ఎంపీటీసీ గొడిసెల ఉమ, టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఉప సర్పంచ్ లింగాల కుమార్, ఎంఈవో సంపత్‌రావు, ఏఈ రాధ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చైర్‌పర్సన్ పరామర్శ

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామానికి చెందిన తూర్పాటి సమ్మయ్య శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, సమ్మయ్య మృతదేహాన్ని శనివారం ఇంటికి తీసుకురాగా మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ నివాళి అర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట ఎంపీపీ రాసకొండ లక్ష్మి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి ఉన్నారు.

మున్సిపల్ కార్మికులకు దుప్పట్లు పంపిణీ

సుల్తానాబాద్: పట్టణంలోని మున్సిపల్ కార్మికులకు లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ వల్స నీలయ్య శనివారం భక్త మార్కండే ఆలయంలో దుప్పట్లు, బ్లాంకెట్స్ పంపిణీ చేశారు. నీలయ్య తన తల్లిదండ్రులు కాంతమ్మ–వీరేశం జ్ఞాపకార్థం అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ముత్యం రమేశ్, బిరుదు కృష్ణ, లయన్స్ క్లబ్ కోశాధికారి రాయల నవీన్, మొగిలి, నల్ల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సును ఢీ కొట్టిన లారీ

జ్యోతినగర్: స్కూల్ బస్సును లారీ ఢీ కొట్టడంతో ముగ్గురు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. శనివారం సాయంత్రం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని స్కూల్ నుం– విద్యార్థులతో యైటింక్లయిన్ కాలనీకి వెళ్లే బస్సు టీటీఎస్ గేట్ నుంచి రాజీవ్ రహదారిపైకి వస్తున్న క్రమంలో లారీ ఢీకొనడంతో బస్సు కుదుపునకు లోనైంది. దీంతో బస్సులో ఉన్న ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి.

అటెన్షన్ ప్లీజ్

పనులు పూర్తయినా అందని తాగునీరు



కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామ పంచాయతీ భవనం వద్ద నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ పనులు పూర్తిచేసినా గ్రామీణ ప్రజలకు తాగునీరు అందడం లేదు. వాటర్ ట్యాంకుకు ఇన్‌పుట్ అవుట్ పుట్ నీటిని సరఫరా చేసే పైపులైన్ ఏర్పాటుచేయకపోవడంతో గ్రామస్తులకు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తాగునీరందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మీరు ప్రశ్నించాల్సిన అధికారి
నరేశ్, గ్రామపంచాయతీ కార్యదర్శి
ఫోన్: 9396358289

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీఆర్ఎస్

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

కాల్వశ్రీరాంపూర్: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జాతీయ పార్టీగా బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించిందని, దేశవ్యాప్తంగా అందరి చూపు సీఎం కేసీఆర్ వైపు ఉందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మీర్జంపేట సర్పంచ్ పుప్పాల నాగార్జున్ రావు నేతృత్వంలో భారీ సంఖ్యలో గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు, యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాభిప్రాయానికి అనుగుణంగా ప్రజా సంక్షేమానికి పాటుపడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అన్నారు. ప్రజలు తమ పార్టీపై విశ్వాసంతో ఇతర పార్టీల నాయకులు, యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో ఉపసర్పంచ్ మూల కుమారస్వామి, శ్యామల, ఉయ్యాల చంద్రయ్య, కల్వల కిషన్‌రెడ్డి, రిందర్ రెడ్డి, తదితరులు చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొట్టె సుజాత, రైతు సమితి మండల కన్వీనర్ దేవయ్య, వైస్ ఎంపీపీ శిరీష, పీఏసీఎస్ చైర్మన్లు రాంచంద్రా రెడ్డి, పురుషోత్తం, కార్యకర్తలు పాల్గొన్నారు.

చీడపీడల నుంచి పొలాలను కాపాడుకోవాలి

ధర్మారం: ప్రస్తుతం వరి పొలాలకు వస్తున్న చీడపీడల నుంచి తగు జాగ్రత్తలు పాటించి కాపాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి పూర్ణిమ రైతులకు సూచించారు. మండలంలోని చామనపల్లిలో రైతులతో కలిసి పొలాలు పరిశీలించి మాట్లాడారు. వారం రోజులుగా కాండం తొలుచు పురుగు, రెక్కల పురుగుల గుడ్ల సముదాయాలు ఎక్కువగా ఉన్నాయని, వీటి ఉధృతిని తగ్గించుకునేందుకు దీపపు ఎర, లింగాకర్షక బుట్టలను అమర్చుకుని రెక్కల పురుగులపై నిఘా పెట్టాలన్నారు. 15 రోజుల వయస్సు ఉన్న వరికి ఎకరాకు కార్బోఫురాన్ 3జీ గుళికలు,పది కిలోల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ కల్పి చల్లాలని కోరారు. రైతులకు ఎలాంటి అనుమానాలున్న వెంటనే తమ సిబ్బందిని కలిసి సలహాలు సూచనలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో సతీశ్ రైతులు పాల్గొన్నారు.


చామనపల్లిలో పొలాన్ని పరిశీలిస్తున్న ఏవో

రామగిరి: మండల పరిధిలో రైతులు సాగు చేసిన వరి పంటలను శనివారం ఏవో మోహన్ పరిశీలించారు. ప్రస్తుతం నాట్లు వేసిన వరి పంటలో మొగిపురుగు ఆశిస్తుందని దీని నివారణ కోసం రైతులకు పలు సూచనలు చేశారు. యాసంగి పంటలో తప్పకుండా కార్బోఫురాన్ 3జీ గుళికలు వేయాలని సూచించారు.

పంచాయతీ పాలకవర్గాల సంబురాలు

రామగిరి: మండలంలోని నాగేపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం పాలకవర్గ సభ్యులు సంబురాలు జరుపుకున్నారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొండవేన ఓదెలు, బీఆర్ఎస్ అధ్యక్షుడు గద్దల శంకర్, ఆలయ కమిటీ చైర్మన్ వేగోలపు శ్రీనివాస్ సన్మానించారు.

గ్రామపంచాయతీల్లో సంబరాలు

కమాన్‌పూర్: గ్రామపంచాయతీల పాలకవర్గ సభ్యుల పదవీ కాలం నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జూలపల్లి, సిద్దిపల్లె గ్రామపంచాయతీ కార్యాలయాల్లో శనివారం పాలకవర్గ సభ్యులు సంబరాలు జరుపుకున్నారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి శాలువాలతో సత్కరించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాసకొండ లక్ష్మి, సర్పంచ్‌లు బొల్లపెల్లి శంకర్ గౌడ్, తాటికొండ శంకర్, ఎంపీటీసీలు శేవ్వ శంకరయ్య, అబ్బిడి వినోద, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


జూలపల్లిలో కేక్ కట్ చేస్తున్న పాలకవర్గం

ఉత్కంఠగా పీపీఎల్ సెమీఫైనల్ పోటీలు


బహుమతులు అందిస్తున్న డీసీపీ

రామగిరి: సెంటినరీకాలనీ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో పెద్దపల్లి పోలీస్ ప్రిమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ సెమీఫైనల్ పోటీలు శనివారం ఉత్కంఠగా సాగాయి. సుల్తానాబాద్–గోదావరిఖని సర్కిల్ జట్ల మధ్య జరిగిన పోటీలో సుల్తానాబాద్ జట్టు, పెద్దపల్లి–గోదావరిఖని టూటౌన్ జట్ల మధ్య జరిగిన పోటీలో పెద్దపల్లి జట్టు విజేతగా నిలిచాయి. సుల్తానాబాద్ జట్టు నుంచి రాజేందర్, పెద్దపల్లి జట్టు నుంచి స్వామి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. వీరికి పెద్దపల్లి డీసీపీ రూపేశ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గోదావరిఖని, పెద్దపల్లి ఏసీపీలు గిరిప్రసాద్, సారంగపాణి, సీఐలు ప్రదీప్, ఇంద్రసేనారెడ్డి, రమేశ్, సతీశ్, గోపాల్, ఎస్సైలు మహేందర్, ఉపేందర్‌రావు, షేక్‌మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

రామగిరి: మండలంలోని రత్నాపూర్‌లో సింగరేణి సంస్థ ఆర్జీ–3 ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాట్లను శనివారం సింగరేణి అధికారులు, వైద్య సిబ్బంది పరిశీలించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏర్పాట్లు పరిశీలించిన వారిలో సర్పంచ్ పల్లె ప్రతిమ, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, డీజీఎం పర్సనల్ విలాస్ శ్రీనివాస్ పొద్దార్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

బీజేపీ ఐటీ సెల్ పార్లమెంట్ కన్వీనర్‌గా సంపత్


సంపత్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పార్లమెంట్ స్థాయి బీజేపీ ఐటీ సెల్ కన్వీనర్‌గా బీమారపు సంపత్‌ను నియమించినట్లు రాష్ట్ర కన్వీనర్ వెంకటరమణ తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం శాయశక్తులా పనిచేస్తానని సంపత్ పేర్కొన్నారు.

స్వర్ణ కారుల సంఘం మండల అధ్యక్షుడిగా రమేశ్

ముత్తారం: స్వర్ణ కారుల సంఘం మండల అధ్యక్షుడిగా అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన ఆకోజు రమేశ్‌ను ఎన్నుకున్నారు. శనివారం మండలంలోని స్వర్ణకారులు సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు.మండల అధ్యక్షుడిగా ఆకోజు రమేశ్, ఉపాధ్యక్షుడుగా రామగిరి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా మారుపాక రామస్వామి, మధుకర్, కరుణాకర్ ప్రకాశ్, శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. అనంతరం రమేశ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. స్వర్ణకారుల సమస్యలకోసం కృషి చేస్తానని తెలిపారు.

ఓదెల విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా రమేశ్

ఓదెల: విశ్వ బ్రాహ్మణసంఘం ఓదెల అధ్యక్షుడిగా పోలోజు రమేశ్ ఏకగ్రీవంగా శనివారం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా నూతి ప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, కోశాధికారి నాగులమల్యాల, లక్ష్మణాచారి ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు సన్మానించారు.

విద్యార్థినులకు చెక్కులు అందజేత


చెక్కులు అందిస్తున్న మలబార్ ప్రతినిధులు

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం 71 మంది విద్యార్థినులకు రూ. 5 లక్షల 68 వేల చెక్కులను మలబార్ గోల్డ్ కార్పొరేట్ సోషల్ సోషల్ రెస్పాన్సిబిలిటీ వారు అందజేశారు. మలబార్ ప్రతినిధులు ఎలిగేటి విక్కీ, చిలుముల శ్రీనివాస్, ఆధ్వర్యంలో చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కటకం అంజయ్య, అధ్యాపకులు రజిత, విజయ, శంకర్, రాజేందర్, రమేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచండి


జీఎంకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు, కౌశిక హరి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో పనిచేస్తున్న ప్రైవేట్ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ శాతవాహన మల్టీపుల్ మోటార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కౌశిక హరి శనివారం ఆర్జీ–2 జీఎం మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓసీపీ–3, 5, ఆర్‌వీఆర్, సీపీ పటేల్, ప్రైవేట్ కాంట్రాక్ట్ కార్మికులు సింగరేణిలో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్నారన్నారు. చాలీ చాలని జీతాలతో కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారిందని, నిత్యావసర ధరలు పెరగడంతో కుటుంబాల పోషణ కష్టంగా మారి చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా ఓసీపీ–5 ,3 ఆర్‌వీఆర్. సీపీ పటేల్ కంపెనీ యజమానులకు వేతనాలు పెంచాలని వినతిపత్రాలు, ఇచ్చినప్పటికీ ఏలాంటి స్పందన లేకపోవడంతో వారు కాలయాపన చేస్తున్నారు. భవిష్యత్తులో సమ్మెకు పోయే పరిస్థితి ఉన్నందునా ప్రిన్సిపాల్ ఎంప్లాయర్‌గా ఆయా కంపెనీల యజమానులతో మాట్లాడి ప్రైవేట్ కాంట్రాక్ట్ కార్మికులకు తగు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కార్యనిర్వాహణ అధ్యక్షురాలు, సర్పంచ్ లావణ్య, ఓబీ కాంట్రాక్ట్ కార్మికులు భాస్కర్, నరేందర్, రమేశ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలందించడంలో తృప్తి


వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఎల్ఎం ట్రస్టు చైర్మన్

ధర్మారం: నిరుపేదలకు ఉచితంగా వైద్యసేవందించాలనే లక్ష్యంతోనే మెగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎల్ఎం చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్, మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి కొప్పుల స్నేహలత అన్నారు. మండలంలోని కటికెనపల్లి ప్రభుత్వ పాఠశాలలో శనివారం ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరాన్ని స్నేహలత ప్రారంభించారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు, షుగర్, బీపీ వైద్య పరీక్షలతో పాటు అన్ని రకాల రోగాలకు రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కారుపాకల రాజయ్య, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజా, సహకార సంఘాల పోరం జిల్లా చైర్మన్ బలరాంరెడ్డి, పత్తిపాక సింగిల్ విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, ఉపసర్పంచ్ రామడుగు గంగారెడ్డి, ట్రస్టు ఆర్గనైజర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కన్వెన్స్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియాలో ఓసీపీ–1, 2, 3 లతో పాటు ఏఎల్‌పీ మైన్‌లో పనిచేస్తున్న కన్వెన్స్ వెహికల్ డ్రైవర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం కన్వెన్స్ వెహికల్ డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎల్ ప్రకాష్, ఆర్జీ–2 బ్రాంచ్ కార్యదర్శి రాజారత్నం, రామగుండం రిజీయన్ కార్యదర్శి బుర్ర తిరుపతి పాల్గొని మాట్లాడారు. కార్మికులకు ఇప్పటి వరకు స్కిల్డ్ వేతనాలు అమలు చేయలేదన్నారు. ఎన్నో వినతిపత్రాలు అందించిన స్పందన కరువైందన్నారు. ఇప్పటికైనా కన్వెన్స్ వెహికల్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 28 నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కన్వెన్స్ వెహికల్ డ్రైవర్లు పాల్గొన్నారు.

నేడు ట్రినిటీలో ఉచిత మెగా వైద్యశిబిరం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రగతినగర్‌లోని ట్రినిటీ ప్రైమరీ పాఠశాలలో నేడు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు అశోక్‌కుమార్, భిక్షపతి, వంశీ తెలిపారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి చొరవతో సన్‌షైన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ శిబిరంలో రక్త పరీక్షలు, ఈసీజీ, టుడీ ఈకో పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తారని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని నిట్టూరు, నిమ్మనపల్లి, పెద్దకల్వల, పెద్దబొంకూర్, పట్టణంలోని రంగంపల్లి, భూంనగర్, కూనారంరోడ్, చీకురాయిరోడ్, మేన్‌రోడ్, కమాన్‌రోడ్, సుభాష్‌నగర్, పోలీస్‌స్టేషన్‌రోడ్, ఉదయ్‌నగర్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ సత్యనారాయణ తెలిపారు.